పారిశుధ్య కార్మికులకు ఉచిత వైద్య శిబిరం

హయత్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): వంద రోజుల ప్రణాళికలో భాగంగా తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొర్రూర్‌లోని కమ్యూనిటీ హాల్‌లో పారిశుధ్య కార్మికులకు, పొదుపు సంఘాల మహిళలకు ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ అమరేందర్ రెడ్డి హాజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు, రొమ్ము క్యాన్సర్, బీపీ, షుగర్, గైనకాలజీ పరీక్షలను నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ల బృందం శిరీష, శృతి, తేజశ్రీ, రాఘవేందర్, మున్సిపాలిటీ ఆర్‌ఓ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వినయ్, పర్యావరణ అధికారి సురేష్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

రాఘవేంద్రనగర్‌కాలనీలో..

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని రాఘవేంద్రనగర్‌కాలనీలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్, భారత ప్రభుత్వం సామాజిక న్యాయం సాధికారత మం త్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వినికిడి సమస్యలు, కీళ్లు, వెన్ను నొప్పుల సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి ఉచితంగా చక్రాల కుర్చీలు, వినికిడి యంత్రాలు, నెక్ బెల్టులు, నడుము బెల్టులు, చేతి కర్రలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పలువురు అసోసియేషన్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో..

ఎల్‌బీనగర్ : సరూర్‌నగర్ వార్డు కార్యాలయంలో శుక్రవారం ప్రధానమంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని పారిశుధ్య కార్మికులకు ప్రత్యేకంగా ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో పారిశుధ్య కార్మికులకు టీబీ స్క్రీనింగ్ పరీక్షలతో పాటు జనరల్ హెల్త్ చెకప్ చేశారు. వైద్య శిబిరాన్ని సరూర్‌నగర్ ఆస్పత్రి వైద్యాధికారి డాక్టర్ అర్చన, ఉపకమిషనర్ సుజాత, శానిటేషన్ డీఈ చందన చౌహాన్‌లు పరిశీలించారు.

సమస్యల పరిష్కారానికి కృషి : కార్పొరేటర్

చంపాపేట : ఆయా కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించనున్నట్లు జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సుజాతనాయక్ అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని శ్రీరమణకాలనీలో కార్పొరేటర్ శుక్రవారం పర్యటించారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి సిబ్బంది చేత పొంగుతున్న డ్రైనేజీలను క్లీన్ చేయించారు. కార్యక్రమంలో నాయకులు గోపీరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సతీష్‌గౌడ్, మమత, మల్లేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అందెల శ్రీరాములుకు శుభాకాంక్షలు

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల బీజేపీ కన్వీనర్‌గా నియమితులైన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్‌ను శుక్రవారం పెద్దఅంబర్‌పేట్‌కు చెందిన బీజేపీ నాయకులు పిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. యువ మోర్చా నాయకులు కట్ట సాయి, నరేష్‌యాదవ్‌తో పాటు పలువురు ఉన్నారు.

బోనాల ఘటాల ఊరేగింపునకు ఆహ్వానం

సంతోష్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సైదాబాద్ డివిజన్ పరిధిలోని శ్రద్ధాబాద్ మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆషాఢమాసం బోనాల ఘటాల ఊరేగింపునకు హాజరుకావాలని కోరుతూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు శుక్రవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సుభాష్‌చందర్‌జీ, సహదేవ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీకాలనీలో కార్పొరేటర్ పర్యటన

మన్సూరాబాద్ : మార్నింగ్‌వాక్ కార్యక్రమంలో భాగంగా మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని విజయశ్రీకాలనీలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి శుక్రవారం పర్యటించారు. ఆయన ప్రతీ గల్లీ గల్లీని తిరుగుతూ అక్కడి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్క నర్సిరెడ్డి, సభ్యులు వెంకట్‌రెడ్డి, రాజేష్, జంగయ్యయాదవ్, మధుసూదన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, ఎల్‌ఎన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, బ్రహ్మచారి పాల్గొన్నారు.

ఘనంగా జీఎస్‌ఐలోని పెద్దమ్మతల్లి బోనాలు

మన్సూరాబాద్: నాగోల్ డివిజన్ బండ్లగూడలోని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా సంస్థ ఆవరణలోని పెద్దమ్మతల్లి ఆలయ బోనాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డీడీజీలు డాక్టర్ ఎల్‌పీసింగ్, సత్యనారాయణ మహాపాత్రోలు విచ్చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో హెడ్ ఆఫ్ ఆఫీస్ హరమోహన్ మిశ్రా, డైరెక్టర్లు డాక్టర్ ఎ.బెనర్జీ, శైలేందర్ సింగ్, జేడీ తారకేశ్వర్‌రావు, ఎం.సుధాకర్‌రావు, మహేష్, శేఖర్ పాల్గొన్నారు.

బోర్ డ్రిల్లింగ్ పనులకు భూమిపూజ

చంపాపేట : చంపాపేట డివిజన్ బైరామల్‌గూడ సాగర్‌రింగ్‌రోడ్డులోని ఫ్లైఓవర్ సమీపంలో ఉన్న రేణుక ఎల్లమ్మ ఆలయం ప్రాంగణంలో శుక్రవారం బోరు డ్రిల్లింగ్ పనులకు కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ ఆలయానికి విచ్చేసే భక్తుల సౌకర్యార్థం నీటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా బోరు డ్రిల్లింగ్ పనులు చేపట్టినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు రఘు, మధు, రాజు పాల్గొన్నారు.

కాలనీ అభివృద్ధికి కృషి చేయాలి : నవజీవన్‌రెడ్డి

వనస్థలిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కాలనీవాసులు కృషి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ బీడీఎల్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నికైన సందర్భంగా శుక్రవారం నూతన కమిటీ సభ్యులను కార్పొరేటర్ పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో నూతన కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఇతర సభ్యులు బాబు, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్, బాలసిద్దులు, చంద్రశేఖర్, జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.


సీసీ రోడ్డు పనులను పరిశీలించిన లచ్చిరెడ్డి

వనస్థలిపురం, జూలై 18(ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ వైదేహినగర్ కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ లచ్చిరెడ్డి శుక్రవారం కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు లెవల్స్‌ను సరిచూసుకుంటు సంబంధిత అధికారులు సీసీ రోడ్డు పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన

చాదర్‌ఘాట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): సైబర్ మోసాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సైబర్ క్రైమ్ సౌత్‌జోన్ ఎస్‌ఐ భిక్షం అన్నారు. శుక్రవారం మలక్‌పేటలోని డాన్ హైస్కూల్‌లో ఆయన సైబర్ భద్రతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆన్‌లైన్ గేమ్స్, వర్క్‌ఫ్రమ్ హోం ఆఫర్లు, డిజిటల్ అరెస్టు లాంటి నకిలీ స్కామ్‌ల ద్వారా అమాయకులను మోసగాళ్లు లక్ష్యంగా పెట్టుకుని మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. సైబర్ మోసాల బారిన పడిన వెంటనే టోల్‌ఫ్రీ 1930కు ఫోన్ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు ఆశుఖన్నా, అడ్మినిస్ట్రేటర్ నర్గీస్, షజీయుల్లా ఫిరాసత్ పాల్గొన్నారు.

వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలి


సాగర్ రహదారిపై వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

వనస్థలిపురం: వాహనదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ టి.మహేష్ అన్నారు. శుక్రవారం వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సాగర్ కాంప్లెక్స్ వద్ద రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆదేశాల మేరకు ఇన్‌స్పెక్టర్ సమక్షంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ 360 వాహనాలను తనిఖీ చేయగా సరైన ధ్రువపత్రాలు లేని సుమారు 25వాహనాలకు రూ.10వేలు చలాన్లు విధించడం జరిగిందన్నారు. అదే విధంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను పాపిలస్ పరికరం ద్వారా చెక్‌చేయడం జరిగిందని తెలిపారు. వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు లాడ్జీలను డీఐ రాజేష్‌తో పాటు ఇతర సిబ్బందితో తనిఖీలు చేశామని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


చైతన్యపురి, దిల్‌సుఖ్‌నగర్ మెయిన్ రోడ్డును ముంచెత్తిన వరద ప్రవాహం


వరద ప్రవాహంలో మలక్‌పేట ఆర్‌యూబీ మెయిన్ రోడ్డు


మలక్‌పేట నల్గొండ చౌరస్తాలో ఇరువైపులా ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిన వాహనాలు


మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తిన వరద ప్రవాహంలోనే వాహనాల రాకపోకలు

భారీ వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం

చాదర్‌ఘాట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): శుక్రవారం కురిసిన భారీ వర్షానికి మలక్‌పేటలోని ప్రధాన రోడ్లన్నీ నదులను తలపించేలా వరద ప్రవాహంతో నిండిపోయాయి. మలక్‌పేట ఆర్‌యూబీ వద్ద వరద నీరు భారీగా చేరడంతో వరద నీరు తోడి పోసేందుకు అధికారులు అవసరమైన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు. దాదాపు గంట పాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మలక్‌పేట మార్కెట్ నుంచి భారీగా వరద నీటి ప్రవాహం రోడ్డుపైకి రావడంతో వరద సమస్య మరింత తీవ్రమైంది. న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ కింద ఉన్న మెయిన్ రోడ్డుపై మోకాలి లోతు వరకు వరద నీరు చేరడంతో మలక్‌పేట నుంచి మలక్‌పేట నల్గొండ చౌరస్తా వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

మూసారాంబాగ్ బ్రిడ్జిని ముంచెత్తిన వరద ప్రవాహం

భారీ వర్షం కారణంగా మూసారాంబాగ్ బ్రిడ్జిని వరద ప్రవాహం ముంచెత్తింది. వరద కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

వరదమయంగా మారిన చైతన్యపురి మెయిన్ రోడ్డు..

గడ్డిఅన్నారం డివిజన్‌లోని లోతట్టు కాలనీలైన శ్రీనగర్‌కాలనీ, కోదండరాంనగర్, పీఅండ్‌టీకాలనీ తదితర కాలనీలు భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయంగా మారాయి. షిరిడీసాయిబాబా ఆలయం రోడ్డునుంచి భారీగా వరద ప్రవాహంతో దిల్‌సుఖ్‌నగర్ మెయిన్ రోడ్డును ముంచెత్తడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల రోడ్ల కిరువైపులా పార్క్ చేసిన వాహనాలు వరదలో మునిగాయి. వరద కారణంగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో చాలా చోట్ల వాహనాలు నడిరోడ్డుపై నుంచే వెళ్లాయి.

బడంగ్‌పేట్, మీర్‌పేట్‌లలో ప్రధాన రహదారులపై నిలిచిన వరద నీరు

సరూర్‌నగర్ : భారీ వర్షానికి బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కేవలం కాలనీల్లోని అంతర్గత రోడ్లు మాత్రమే కాకుండా ప్రధాన రహదారులు సైతం వరద నీటితో నిండిపోయాయి. దాంతో గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బడంగ్‌పేట్-నాదర్‌గుల్ రహదారిలో డీపీఎస్ వద్ద, మునిసిపల్ భవనం సమీపంలో, భీష్మనగర్‌కాలనీ వద్ద వరద నీరు చేరడంతో మునిసిపల్ సిబ్బంది ఆయా ప్రాంతాల్లో రోడ్డు డివైడర్‌ను తొలగించి వరద నీరు సాఫీగా దిగువకు సాగిపోయేలా చర్యలు తీసుకున్నారు. అల్మాస్‌గూడలోని విశాకనగర్, ఆర్‌ఎంఆర్‌కాలనీ, శివనారాయణపురం, సాయిప్రభు హోమ్స్, సాయిబాలాజీ హోమ్స్, గ్రీన్‌హోమ్స్ కాలనీ, మధురాపురి కాలనీ తదితర ప్రాంతాలు జలమయమయ్యాయి.


చంపాపేట చౌరస్తా డీమార్టు ముందు సాగర్ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీటిలో తోసుకుంటూ వెళ్తున్న వాహనదారుడు

మళ్లీ మునిగిన మిథిలానగర్

ఎప్పటిలాగే మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడలో గల మిథిలానగర్ కాలనీ మరోసారి వరద నీటిలో మునిగిపోయింది. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని ఆర్‌ఎన్‌రెడ్డినగర్, ద్వారకామాయినగర్, శ్రీధర్‌కాలనీ, గాయత్రీనగర్, నందిహిల్స్, అయోధ్యనగర్‌కాలనీ, ఎంఎల్‌ఆర్‌కాలనీ తదితర ప్రాంతాల్లో వరదనీరు నిలవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆయా ప్రాంతాల్లో మునిసిపల్ అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.

చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో..

చంపాపేట : చంపాపేట, హస్తినాపురం డివిజన్లలో ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. ఆయా కాలనీల్లో రహదారులు పూర్తిగా జలమయం అయ్యాయి. చంపాపేట చౌరస్తాలో సాగర్ ప్రధాన రహదారిపై డీమార్టు ముందు మోకాళ్ల వరకు వర్షం నీళ్లు నిలువడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురైనాయి. డీమార్టు పరిసర ప్రాంతం చెరువును తలపించింది. మాన్‌సూన్ టీం సిబ్బంది నీరు సాఫీగా వెళ్లేందుకు తగిన చర్యలు చేపట్టారు.

హయత్‌నగర్‌లో గాలికి కూలిన వృక్షం

హయత్‌నగర్ : హయత్‌నగర్‌లో ఈదురు గాలితో కూడిన వర్షం కురిసింది. దీంతో హయత్‌నగర్ పెద్దమ్మగుడి చౌరస్తా నుంచి మునగనూర్‌కు వెళ్లే రోడ్డులో హెచ్‌పీ గ్యాస్ గోదాం పక్కనే ఉన్న భారీ వృక్షం ఒక్కసారిగా నేల కూలింది. చెట్టు కూలుతున్న సమయంలో అక్కడ ప్రజలు, వాహనదారులు లేక పోవడంతో తీవ్ర ప్రమాదం తప్పింది. దీంతో రాక పోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వెంటనే డిజాస్టర్ సిబ్బంది వచ్చి చెట్టును తొలగించి రోడ్డును క్లియర్ చేశారు.

ఉదయం, పగలు ఎప్పుడైనా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు

- **సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు**

చాదర్‌ఘాట్ : మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులను గుర్తించి పట్టుకోవడానికి రాత్రి వేళల్లోనే కాకుండా ఇక నుంచి ఉదయం పగటి వేళల్లో ఎప్పుడైనా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించనున్నట్లు సౌత్ ఈస్ట్ జోన్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్ తెలిపారు. మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనదారులపై స్పెషల్ డ్రంకెన్ డ్రైవ్‌ను శుక్రవారం పరిశీలించారు. గురు, శుక్రవారాల్లో మలక్‌పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధుల్లోని పలు ప్రాంతాల్లో ఆకస్మాత్తుగా డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించడం ద్వారా వాహనదారులకు కూడా మద్యం సేవించి వాహనాలు నడపరాదనే అవగాహన మరింత పెరుగుతుందన్నారు. ఇది వరకు రాత్రి వేళల్లోనే ఉండే డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, నగర జాయింట్ ట్రాఫిక్ పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ ఆదేశాల మేరకు ఉదయం, పగటి వేళల్లో ఎప్పుడైనా ఎక్కడైనా నిర్వహించాలని ఆదేశించినట్లు ఆయన వివరించారు. మలక్‌పేట నల్గొండ చౌరస్తా, మూసారాంబాగ్ చౌరస్తా, దిల్‌సుఖ్‌నగర్ రాజీవ్‌చౌక్ చౌరస్తాలో డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు.


డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలను పరిశీలిస్తున్న ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్, పక్కన మలక్‌పేట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్

చేప పిల్లల పంపిణీకి బదులుగా ఖాతాలో డబ్బులు జమ చేయండి

- **ముఖ్యమంత్రికి లేఖ రాసిన తెలంగాణ మత్స్య కార్మిక సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ**

హయత్‌నగర్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే చేప పిల్లల వ్యవహారంలో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నాయని.. మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లలకు బదులుగా అకౌంట్‌లో డబ్బులు వేయాలని కోరుతూ మత్స్య కార్మిక సహకార సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొరెంకల నర్సింహ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి శుక్రవారం లేఖ రాశారు. ప్రతి సంవత్సరం టెండర్ల ద్వారా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యవహారంలో పెద్దఎత్తున కాంట్రాక్టర్లు అక్రమాలకు పాల్పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. కాంట్రాక్టర్ చేప పిల్లలను సరియైన సమయంలో అందజేయకుండా అక్టోబర్, నవంబర్‌లో నాసిరకం చేప పిల్లలను అందిస్తున్నాడని తెలిపారు. దీంతో చేప పిల్లలు సరిగా పెరగకపోవడంతో తీవ్ర నష్టాలు వస్తున్నాయని తెలిపారు. దీంతో తమను ఆదుకోవాలన్న ప్రభుత్వ ఆశయం కూడా నెరవేరడం లేదన్నారు. ప్రస్తుతం కొహెడ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఖాతాలో చేపపిల్లల కొనుగోలు కోసం ప్రభుత్వం నిధులు వేయాలని కోరారు. టెండర్లను పూర్తిగా రద్దుచేయాలని రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సహకార సంఘాల నుంచి తీర్మానం చేసి ముఖ్యమంత్రికి అందిస్తున్నట్లు చెప్పారు. సహకార సంఘాల్లో డబ్బులు జమ చేస్తే తాము ఇష్టం ఉన్న చోట మంచి రకం చేప పిల్లలను కొనుగోలు చేసుకుని పెంచుతామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కొహెడ మత్స్య పారిశ్రామిక సహకార అధ్యక్షుడు యార లక్ష్మయ్య, నాయకులు తమ్మల అశోక్, సాదు శివశంకర్, శి, ప్రవీణ్, యాదగిరి పాల్గొన్నారు.

సర్వే నంబర్ 283లో ప్రభుత్వ భూమిని కాపాడండి

- **జిల్లా కలెక్టర్‌కు సీపీఎం నేతల వినతి**

అబ్దుల్లాపూర్‌మెట్, జూలై 18(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలోని సర్వే నంబర్ 283లో కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని రక్షించాలని సీపీఎం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల యాదయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఏర్పుల నర్సింహతో కలిసి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య మాట్లాడుతూ అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధి సర్వే నంబర్ 283లో 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉందన్నారు. అయితే 2006 సంవత్సరంలో పీఓటీ యాక్టు ద్వారా ఆ సర్వే నంబర్‌లోని భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుందన్నారు. కొంతమంది రియల్ వ్యాపారులు, దళారులు కుమ్మక్కై సదరు సర్వే నంబర్‌లోని కొంత భూమిని కబ్జా చేశారని పేర్కొన్నారు. కోర్టు ఆర్డర్స్ సాకుతో యథేచ్ఛగా ప్రభుత్వ భూమిలో ప్రీకాస్ట్‌తో గోడలు ఏర్పాటు చేశారని తెలిపారు. అదే సర్వే నంబర్‌లో పేదలు 60గజాల్లో ఇళ్లు కట్టుకుంటే రెవెన్యూ అధికారులు కూల్చివేశారని, కోట్ల రూపాయల స్థలం కబ్జా అవుతున్నా పట్టించుకోవడం లేదని కలెక్టర్‌కు వివరించారు. ప్రభుత్వ భూమిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్లు చేస్తున్నా అధికారులు చూసిచూడనట్లు వదిలేస్తున్నారని చెప్పారు. ఆ భూమిని కబ్జాదారుల నుంచి రక్షించి స్థానిక పేద రైతులకు లేదా ఇళ్ల స్థలాలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహేష్, బాలరాజు, సత్తయ్య, భిక్షపతి పాల్గొన్నారు.


కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నిరు పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించండి

మన్సూరాబాద్ : ఎల్బీనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. రంగారెడ్డి కలెక్టరేట్‌లో శుక్రవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ మూడు సర్కిళ్ల పరిధిలో ఇల్లు లేకుండా ఎంతో మంది నిరుపేదలు అద్దెలు చెల్లించలేని స్థితిలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. హయత్‌నగర్ పరిధిలోని సాహెబ్‌నగర్‌కలాంలోని సర్వే నం.71,162లలో, కుంట్లూరులోని సర్వే నం.308లో, ఆమనగల్లులోని సర్వే నం.191,40,27లలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి అక్కడి నిరుపేదలకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చిన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్, రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, జిల్లా కమిటీ సభ్యులు చంద్రమోహన్, నర్సిరెడ్డి, ఎల్బీనగర్, సరూర్‌నగర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

మూర్ఛ వ్యాధితో వ్యక్తి మృతి

సంతోష్‌నగర్ : మద్యం సేవించిన వ్యక్తికి మూర్ఛ(ఫిట్స్) రావడంతో అతను నాలుకను కొరకడంతో తీవ్ర రక్తస్రావంతో మృతి చెందిన సంఘటన సంతోష్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. చంద్రాయణగుట్ట బండ్లగూడకు చెందిన మల్లేష్‌సాగర్(38) రోడ్లపై ప్లాస్టిక్ చెత్తను సేకరిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతను కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి డీఎమ్‌ఆర్‌ఎల్ చౌరస్తాలో ఉన్న మద్యం దుకాణంలో మద్యం సేవించాడు. మల్లేష్‌కు ఒక్కసారిగా మూర్ఛవ్యాధి రావడంతో నాలుకను కొరకడంతో నోటి నుంచి తీవ్ర రక్తస్రావం కావడంతో స్పృహ తప్పిపోయాడు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు 108 వైద్య సిబ్బందితో పరీక్షించగా అప్పటికే మరణించినట్లు ధ్రువీకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ మణికంఠ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

సంతోష్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన మాదన్నపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పుర లాట్ బైక్ హోటల్ సమీపంలో 40-45 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం స్థానికులకు కన్పించడంతో పోలీసులకు సమాచారం అందజేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలను సేకరించారు. మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. వివరాలు తెలిసిన వారు ఎవరైనా ఉంటే మాదన్నపేట పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు ఎస్‌ఐ శశికాంత్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

హయత్‌నగర్ : నడుచుకుంటు రోడ్డు దాటుతున్న గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని సుమారు 50 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి శుక్రవారం తెల్లవారుజామున లక్ష్మారెడ్డిపాలెం మహీంద్రా షోరూం వద్ద జాతీయ రహదారిని దాటుచుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి తలకు, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి వంటిపైన మెరూన్ రంగు డబ్బాల లుంగీ, బ్లూ కలర్ అండర్ వేర్ ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. అదేవిధంగా మృతుడి ఎడమ చేతిపైన ఎన్. బాలమణి అని రాసి ఉందని ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతుడికి సంబంధించిన వారు ఉంటే వెంటనే హయత్‌నగర్ పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు హయత్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కట్ట మైసమ్మకు బోనం సమర్పించిన సబిత

సరూర్‌నగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి గురువారం రాత్రి జిల్లెలగూడలో బోనాల వేడుకలు జరుపుకున్నారు. తన కుటుంబ సభ్యులతో కలిసి సబితారెడ్డి జిల్లెలగూడలోని క్యాంపు కా ర్యాలయంలో బోనం తయారు చేశారు. కాగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన బీఆర్‌ఎస్ మహిళా నేతలు సైతం బోనాలు తయారు చేసి క్యాంపు కార్యాలయానికి తీసుకువచ్చారు. అనంతరం అక్కడి నుంచి జిల్లెలగూడ కట్ట మైసమ్మ ఆలయం వరకు బోనాలతో సామూహిక ఊరేగింపు నిర్వహించారు. ఎమ్మెల్యే సబిత కుటుంబ సభ్యులు వారితో కలిసి నడిచారు. అనంతరం మైసమ్మకు భక్తి శ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో సరూర్‌నగర్ మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్యబీరప్ప, మాజీ కార్పొరేటర్లు దీపికాశేఖర్‌రెడ్డి, స్వప్నాజంగారెడ్డి, మాజీ కోఆప్షన్ సభ్యురాలు ప్రసన్నావెంకట్‌రెడ్డి, మహిళా నేతలు లతాశేఖర్, వంగేటి లక్ష్మీలక్ష్మారెడ్డి, సబిత తనయుడు కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మీర్‌పేట్ అధ్యక్షుడు కామేశ్‌రెడ్డి, బడంగ్‌పేట్ అధ్యక్షుడు రాంరెడ్డి పాల్గొన్నారు.

ట్రంక్‌లైన్ పనుల్లో వేగం పెంచాలి : సుధీర్‌రెడ్డి


ట్రంక్‌లైన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి

చంపాపేట : ట్రంక్‌లైన్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్‌లోని ఆ యా కాలనీల మీదుగా కొనసాగుతున్న ట్రంక్‌లైన్ నిర్మాణ పనులను సాగర్ రింగ్‌రోడ్డులో ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వర్షాకాలంలో హస్తినాపురం, వనస్థలిపురం డివిజన్స్‌లోని పలు కాలనీలు ముంపునకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం నిర్మిస్తున్న ట్రంక్‌లైన్ నిర్మాణంతో ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు అందోజు సత్యంచారి, ఎల్బీనగర్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, నాయకులు జక్కిడి రఘువీర్‌రెడ్డి, మధుసాగర్ పాల్గొన్నారు.

మంత్రి కార్యక్రమ ఏర్పాట్లను పరిశీలించిన దేప

ఎల్‌బీనగర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆషాఢమాస బోనాల ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నుంచి ఎన్టీఆర్‌నగర్‌లోని ఖిల్లా మైసమ్మ ఆలయంలో బోనాల వేడుకలు ప్రారంభం కానున్నాయి. బోనాల వేడుకలను పురస్కరించుకుని ఆదివారం మంత్రి సీతక్క రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఈ కార్యక్రమానికి చేస్తున్న ఏర్పాట్లను టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, ఖిల్లా మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సురేంద్రకుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావు, ధన్‌రాజ్‌గౌడ్, పెద్దవూర సైదులు, జంగారెడ్డి, శ్రీశైలం, సందీప్, నబీ పాల్గొన్నారు.

ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను సద్వినియోగం చేసుకోండి

కొత్తపేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): భారత ప్రభుత్వ ఎలక్ట్రానిక్ అండ్ ఇన్‌ఫర్‌మేషన్ టెక్నాలజీ మంత్రిత్వశాఖ సహకారంతో సీ డాక్ హైదరాబాద్ నిర్వహించనున్న ఐదు రోజుల ఉచిత ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(ఎఫ్‌డీపీ)ను సద్వినియోగం చేసుకోవాలని సైంటిస్టు - జీ, సెంటర్ హెడ్ డా.పీఆర్ లక్ష్మీఈశ్వరి తెలిపారు. ఆగస్టు 4 నుండి 8వ తేదీ వరకు ఇంటర్‌నెట్ ఆఫ్ థింగ్స్(ఐఓటీ) ఐడియా టు ప్రోటోటైప్ టు ప్రాడక్ట్(ఐ-పీ-పీ)పై నిపుణుల 40గంటల ఆఫ్‌లైన్ సెషన్స్ ఉంటాయన్నారు. ఈ సెషన్స్ ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకులు, ఎస్‌టీఈఎం సబ్జెక్టులను బోధించే పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్ల కోసం ప్రత్యేకంగా రూపొందించారని పేర్కొన్నారు. ఐఓటీ ఆర్కిటెక్చర్, కేస్‌స్టడీస్, ఎకో సిస్టం, ఎల్‌పీ డబ్ల్యూఏఎన్ ప్రోటోకాల్స్, కమ్యూనికేషన్ టెక్నాలజీస్ నెట్ వర్కింగ్, అప్లికేషన్ లేయర్ ప్రోటోకాల్స్, క్లౌడ్ కంప్యూటింగ్ ప్లాట్ ఫాంస్ తదితర కీలక అంశాలపై నిపుణుల సెషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అర్హత గల అధ్యాపకులు ఈనెల 31 లోగా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

మాన్సూన్ రేస్ కోర్సులు ప్రారంభం

ఓల్డ్‌మలక్‌పేట, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఈనెల 21 నుంచి అక్టోబర్ 31 వరకు మాన్సూన్ రేస్‌లు జరుగుతాయని రేస్‌క్లబ్ చైర్మన్ సురేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాయంత్రం మలక్‌పేట రేస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్ రేస్‌ల కోసం 6 రేస్ సమావేశాలు రూపొందించడంతో పాటు, మానసం రేస్ 2025 కోసం ప్రైజ్‌మనీగా రూ.13,80, 80,000 కోట్లను ప్రకటించబడ్డాయని తెలిపారు. దేశంలోనే ఇంత పెద్దమొత్తంలో ప్రైజ్‌మనీ ఎక్కడ లేదన్నారు. గత పది ఏళ్లలో హెచ్‌ఆర్సీలో జరిగిన రేసుల రోజులు, రేస్‌ల సంఖ్య దేశంలోనే అత్యధికమన్నారు. ఈ రేసులో దేశవ్యాప్తంగా 612 గుర్రాలు పాల్గొంటున్నాయని, వీటిలో 166 రెండేళ్ల వయసున్న గుర్రాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ఆగస్టు 24న గవర్నర్ కప్, 31న కోరమండల్ ఏపీజే అబ్దుల్ గ్లామర్ డెక్కన్ ఫిల్లీస్ చాంపియన్ షిప్ స్టేక్స్ గ్రేడ్-3, సెప్టెంబర్ 7న వై.శంకర్‌రావు మెమోరియల్ డెక్కన్ కోల్ట్స్ చాంపియన్ షిప్ స్టేక్స్, 14న భారతదేశ అధ్యక్షుడు గోల్డ్ కప్ గ్రేడ్-2, అక్టోబర్ 2న లెక్కలు డెక్కన్ డెర్బీ గ్రేడ్-1, అక్టోబర్ 27న గోల్కొండ సెయింట్ లెగర్ గ్రేడ్-2, పందేలు నిర్వహించబడతాయన్నారు. హెచ్‌ఆర్సీలో 24మంది ఏ లైసెన్స్ ఏడుగురు బీ లైసెన్స్ పొందిన శిక్షకులు, 21మంది లైసెన్స్ పొందిన జాకీలు, 5గురు అప్రెంటీస్ జాకీలు, 11మంది డి లైసెన్స్ పొందిన జాకీలు ఉన్నారని ఆయన తెలిపారు.